క్లుప్తంగా

వెంకట సూర్య ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు

పాతపట్నం: పాతపట్నం కోర్టు కూడలి వద్ద ఉన్న వెంకట సూర్య దంత వైద్యశాలకు ఆరోగ్యశ్రీ అనుమతులు వచ్చాయని వైద్యుడు సనపల బాలకృష్ణ శనివారం తెలిపారు. పాతపట్నంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ, ఆర్టీసీ, పోలీస్, ఫైర్ ఉద్యోగులు, రిటైర్డ్ పోలీసులు, జర్నలిస్టులకు ఉచితంగా దంత వైద్య సేవలు అందించనున్నామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని బాలకృష్ణ కోరారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులు

సారవకోట: రక్తదానం చేసేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని టీడీపీ మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని అడ్డపనస గ్రామంలో ధర్మాన తేజ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆపద సమయంలో ఉన్నవారికి ప్రాణదానంగా మారుతుందన్నారు. శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 220 మంది రక్తదానంలో పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు.

పరామర్శ..

సారవకోట: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన ద్రోణాచార్యులు కుటుంబాన్ని కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే బొడ్డెపల్లి సత్యవతి శనివారం పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఇటీవల ద్రోణాచార్యులు అనారోగ్యంతో మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు.

రామాలయంలో బోరు ఏర్పాటు



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన బోరు

సారవకోట: మండలంలోని పెద్దలంబ గ్రామంలోని రామాలయం ఆవరణలో రూ.63 వేలతో బోరు ఏర్పాటు చేశారు. ఆ గ్రామానికి చెందిన కొండాల బాలకృష్ణ, ఉర్జాన తిరుపతిరావులు సొంత నిధులతో ఆలయానికి వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం కోసం బోరు ఏర్పాటు చేశారు.

తాగునీరు సరఫరా



తాగునీటి సరఫరా చేస్తున్న దృశ్యం

కొత్తూరు: మండల కేంద్రంలో ప్రత్యేక వాహనం ద్వారా తాగునీటిని సర్పంచ్ పడాల కృష్ణవేణి ఆధ్వర్యంలో శనివారం సరఫరా చేశారు. మెగా పైపులైన్ పాడవ్వడంతో కొత్తూరుకు వారం రోజుల నుంచి నీటిసరఫరా నిలిచిపోయింది. ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న విషయం సర్పంచ్ దృష్టికి వెళ్లడంతో సమస్యను పరిష్కరించారు.

26 నుంచి లెప్రసీ సర్వే

నరసన్నపేట: జిల్లా వ్యాప్తంగా లెప్రసీ కేసులు గుర్తించేందుకు ఈ నెల 26 నుంచి (లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్-ఎల్‌సీడీసీ-23) సర్వే చేపట్టనున్నామని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్ తెలిపారు. మండలంలోని ఉర్లాం పీహెచ్‌సీలో అనుమానిత లెప్రసీ కేసును శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 26 నుంచి జులై 16 వరకు సర్వే చేపట్టనున్నామన్నారు. ఆశ వర్కర్లు, వలంటీర్లు పాల్గొంటారని తెలిపారు. ఇంటింటా సర్వే చేస్తామని, లెప్రసీ కేసులు గుర్తించి వారికి అవసరమైన సలహాలు, సూచనలు, మందులు ఇస్తామన్నారు. గత ఏడాదిలో నిర్వహించిన సర్వేలో 95 కేసులు నమోదయ్యాయన్నారు.

ప్రజలే స్పందించారు..



ప్రమాదంలో జరిగిన ప్రదేశంలో ఎర్ర జెండాలు పెడుతున్న స్థానికులు

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం గ్రామ సమీపంలోని అవధానులు చెరువులో ఇటీవల ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు బోల్తాపడిన విషయం విదితమే. ఇక్క రహదారి రక్షణ గోడపూర్తిగా కూలిపోయింది. ఇంత ప్రమాదం జరిగినా ఆర్‌అండ్‌బీ అధికారుల్లో చలనం లేదు. దీంతో ప్రమాదస్థితిలో ఉన్న ఆ ప్రదేశంలో పురుషోత్తపురం గ్రామస్తులు ఎర్రజెండాలు ఏర్పాటు చేశారు. అధికారులు నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గడపగడపలో సంతోషం

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి



పొందూరు: ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు/పోలాకి/కొత్తూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరుతున్నాయని, ప్రతి ఇంటి సంతోషం నెలకొందని స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి అన్నారు. పొందూరు మండలంలోని తండ్యాం గ్రామంలో స్పీకర్ సీతారాం, పోలాకి మండలంలోని అంపలాం పంచాయతీ పరిధి రాజారాంపురం గ్రామంలో ఎమ్మెల్యే కృష్ణదాస్, కొత్తూరు మండలం నివగాం గ్రామంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. బడుగు, బలహీన వర్గాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరువ చేయడమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. ఇంటింటా సంతోషాన్ని నింపుతున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



పోలాకి: ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



కొత్తూరు: సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రతిభకు ప్రోత్సాహం



నరసన్నపేట: నరసన్నపేట జెడ్పీహెచ్‌ఎస్ (బోర్డు)లో ప్రభుత్వ పారితోషికాన్ని అందజేస్తున్న జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ

జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శనివారం సత్కరించారు. మండల స్థాయిలో పాఠశాలల్లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయుల చేతులమీదుగా అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంతోపాటు ప్రశంసాపత్రం, మెడల్ అందజేశారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో జీవితంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని వక్తలు ఆకాంక్షించారు. మిగతా విద్యార్థులు కూడా సన్మాన గ్రహీతలను ఆదర్శంగా తీసుకుని, స్ఫూర్తి పొందాలన్నారు. – సాక్షి నెట్‌వర్క్



సరుబుజ్జిలి: సరుబుజ్జిలి జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులతో సర్పంచ్ బొడ్డేపల్లి చాందిని, ఉపాధ్యాయులు



జలుమూరు: శ్రీముఖలింగం జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు సన్మాన పత్రాలు అందించిన ఎంపీపీ గోపి, వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎల్.ఎన్.పేట: పూశాం జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న వైస్ ఎంపీపీ ఇందు



పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ సుజాత

వీరవనిత ఝాన్సీలక్ష్మీబాయి

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఝాన్సీలక్ష్మిబాయి వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఉన్న ఝాన్సీ లక్ష్మీబాయి విగ్రహానికి ట్రస్ట్ అధ్యక్షుడు పి.రామరాజు, వైస్ ప్రిన్సిపాల్ వి.అర్చన పూలదండలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర వహించిన వీరవనిత ఝాన్సీలక్ష్మీబాయి అని కొనియాడారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఝాన్సీలక్ష్మీబాయి విగ్రహానికి రిబ్బన్ వేస్తున్న వైస్ ప్రిన్సిపాల్ అర్చన, రామరాజు

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

ఆమదాలవలస: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఎంతటివారిపైన అయినా చర్యలు తప్పవని స్పీకర్ తమ్మినేని సీతారాం హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం నాలుగు మండలాలు, మున్సిపాల్టీ అధికారులు, తసీల్దార్లు, సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఆమదాలవలస నియోజకవర్గం పరిధిలో ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి, పొందూరు మండలాలతోపాటు, ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. కట్టుదిట్టమైన అధికార యంత్రాంగం ఉన్నప్పటికీ ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కావడం క్షమించరాని నేరమన్నారు. నియోజకవర్గంలో పలుచోట్ల మంజూరయ్యే ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు, అర్హులైన నిరుపేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలన్న, భూమి లభించడం లేదన్నారు. చివరికి భవనాల నిర్మాణాలకు, లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీకి ప్రభుత్వమే భూ సేకరణ చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ రికార్డుల వారిగా పంచాయతీ చెరువులు, ఇరిగేషన్ చెరువులు, పోరంబోకు స్థలాలు, కొండ పోరంబోకు స్థలాలు, కాలువ గట్లలో ఆక్రమిత స్థలాలతోపాటు ఏ ప్రభుత్వ శాఖకు చెందిన స్థలాన్ని అయినా ఆక్రమణదారుల గుప్పిట్లో ఉంటే వాటిని వెంటనే ఖాళీ చేయించాలని ఆదేశించారు. ఈ సమావేశానికి సబ్ డివిజన్ రెవెన్యూ అధికారులు, ఆమదాలవలస మండల తహసీల్దార్ హాజరుకాకపోవడంపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

లాసెట్‌లో 38వ ర్యాంకు



డేవిడ్‌కుమార్

సరుబుజ్జిలి: లాసెట్ ఫలితాల్లో సరుబుజ్జిలి గ్రామానికి చెందిన అదపాక డేవిడ్‌కుమార్ ఐదేళ్ల న్యాయకోర్సుకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో 38వ ర్యాంకు సాధించాడు. ఈ విద్యార్థి 1 నుంచి 5వ తరగతి వరకు సరుబుజ్జిలి ప్రాథమిక పాఠశాల, 6 నుంచి 10వ తేదీ వరకు సరుబుజ్జిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియెట్ సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్నాడు. ర్యాంకు రావడం పట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రావిల్లి భూషణరావు అభినందనలు తెలిపారు.

చిరుధాన్యాల సాగుతో భూసారం



చిరు ధాన్యాల కిట్లుతో గిరిజన రైతులు

సారవకోట: మండలంలోని మాళువ గ్రామంలో సీపీఎఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గిరిజన రైతులకు చిరు ధాన్యాలను పంపిణీ చేశారు. కొర్రలు, రాగులు, సజ్జలు, పప్పు ధాన్యాల్లో కందులు, మినుములు కిట్లు అందజేశారు. ఈ చిరు ధాన్యాలను సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. సంస్థ సభ్యులు సంతోష్, హరిబాబు పాల్గొన్నారు.

నియామకపత్రాల అందజేత

పాతపట్నం: కొత్తూరు మండలంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి చొరవతో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సహాయకులను అధికారులు నియమించారు. వారికి పాతపట్నం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నివగాం-3 అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలుగా అల్లాడ గౌరమ్మ, కుద్దిగాం అంగన్‌వాడీ సహాయకురాలుగా పెనుగుదురు సాయిలీలకు శనివారం నియామకపత్రాలను ఎమ్మెల్యే రెడ్డి శాంతి అందజేశారు. సీడీపీఓ యు.విమలకుమారి పాల్గొన్నారు.



నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

మెళియాపుట్టి: జగన్నకు చెబుదాంకు వచ్చిన ప్రజా సమస్యలను గడువులోగా సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని మండల ప్రత్యేక అధికారి భవానీశంకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో శనివారం సమీక్షించారు. సమస్యలను ఓపికగా విని పరిష్కరించాలన్నారు. ఇదివరకు వచ్చిన ప్రజా సమస్యలు, తీసుకున్న చర్యలపై ఆరాతీశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాను సారం వారానికి ఒకసారి దీనిపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. శాఖలవారీగా వచ్చిన ఫిర్యాదులపై సంబధిత అధికారులు దృష్టి సారించాలన్నారు. ఫిర్యాదు చేసిన వారు సంతృప్తి చెందేలా అధికారులు పనిచేయాలన్నారు. ఎంపీడీఓ చంద్రకుమారి, వ్యవసాయశాఖ అధికారి ధానకర్షుడు, ఆర్‌ఐ వైకుంఠరావు, గృహనిర్మాణశాఖ ఏఈ శ్రీనివాసరావు, ఏఈలు ఆనంద్, నాయుడు, ఏపీఓ రవి పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ



నరసన్నపేట: మాకివలసలో విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ తదితరులు



బూర్జ: రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్, తదితరులు



జలుమూరు: రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎంపీటీసీ హరిప్రసాద్

నరసన్నపేట: మండలంలో ఇప్పటివరకు 750 క్వింటాళ్ల వరి విత్తనాలు రైతులకు రాయితీపై సరఫరా చేశామని వ్యవసాయాధికారి కె.సునీత తెలిపారు. శనివారం మాకివలస, సత్యవరం, కామేశ్వరిపేట, గోకయ్యవలసతోపాటు పలు గ్రామాల్లో వరి విత్తనాలు పంపిణీ చేశామన్నారు. మరో 300 క్వింటాళ్ల వరకు విత్తనాలు రావాల్సి ఉందని, వాటిని కూడా నాలుగైదు రోజుల్లో పంపిణీ చేస్తామన్నారు. రైతుల చెంతకే విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. సత్యవరంలో ఎంపీపీ ఆరంగి మురళి విత్తనాలు పంపిణీని ప్రారంభించారు.

మామిడివలసలో

బూర్జ: మండలంలోని మామిడివలస సచివాలయంలో శనివారం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. రైతులకు కావాల్సిన అన్ని రకాల ఇన్‌పుట్స్ ఆర్బీకేల ద్వారా అందజేస్తామని సర్పంచ్ కొబగాపు రామ్మకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ సీర ఢిల్లేశ్వరరావు, సచివాలయ సిబ్బంది తెలిపారు.

శ్రీముఖలింగంలో..

జలుమూరు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని శ్రీముఖలింగం ఎంపీటీసీ సభ్యుడు కె.హరిప్రసాద్ అన్నారు. శనివారం శ్రీముఖలింగంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రాయితీపై పంపిణీ చేశారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్ష విజయవంతం చేయండి

నరసన్నపేట: ప్రజా సమస్యలను సంతృప్తికర స్థాయిలో పరిష్కరించడం, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిచడమే లక్ష్యంగా చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండలంలో విజయవంతం చేయాలని ఎంపీపీ ఆరంగి మురళి, ప్రత్యేక అధికారి కవిత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ముందుగానే ప్రజా సమస్యలను గుర్తించి వారితో వలంటీర్ల ద్వారా దరఖాస్తులు చేయించి న్యాయం జరిగేలా చూడాన్నారు. ఈ మేరకు ప్రతీ సచివాలయంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామన్నారు. నాలుగైదు రోజుల్లో షెడ్యూల్ వేస్తామని, దీని ప్రకారం గ్రామాల్లోకి అధికారుల బృందాలు వస్తాయన్నారు. హౌసింగ్ డీఈఈ అప్పారావు, ఏఈ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించి అరులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తోందని, ఇప్పటికే వివిధ సాంకేతిక కారణాలతో తప్పిపోయిన వారికి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గుర్తించి పథకాలు వర్తింపజేస్తామని ఎంపీపీ వాన గోపి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో శనివారం మాట్లాడారు. అర్హులైన వారు అర్జీలు పెట్టుకుంటే వారికి సంక్షేమ ఫలాలు అందిచండం జరుగుతుందన్నారు. తహసీల్దార్ బి.సత్యం, ఎంపీడీఓ అప్పారావు, ఈఓపీఆర్డీ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పాతపట్నం: మండలంలోని 18 గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి ఎం.కరుణకరరావు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీఓ ఆధ్వర్యంలో బృందాలు పనిచేస్తాయన్నారు. ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, డీటీ బి.ప్రసాదరావు, ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా, మండల అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పీఎంకేవీవై నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌లో భాగంగా డెమోస్టిక్ డెటా ఎంట్రీ, డెబిట్ రికవరీ ఏజెంట్ కోర్సుల్లో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. జూలై 10వ తేదీన తరగతులు ప్రారంభకానున్నాయన్నారు. ఇంటర్ పాసై ఉండాలని, 18 నుంచి 30 ఏళ్ల వయస్సు గలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉదయం 9 నుంచి 1 గంట వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 95532 92734ను సంప్రదించాలన్నారు.

విత్తనశుద్ధితో మేలు

ఎల్.ఎన్.పేట: విత్తనాలు వేసే రైతులు కొనుగోలు చేసిన, నిల్వ ఉంచినవి శుద్ధి చేసుకోవాలని ఏఓ పైడి లతశ్రీ అన్నారు. తన కార్యాలయంలో శనివారం వ్యవసాయ సహాయకులకు అవగాహన కల్పించారు. విత్తన శుద్ధి ద్వారా పురుగులు, అనేక తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చని సూచించారు. విత్తన శుద్ధితో మొలక శాతం పెరుగుతుందన్నారు.

నిండు జీవితాలను బలితీసుకోవద్దు

ఆమదాలవలస: సమస్యలు వచ్చినపుడు క్షణికావేశంలో నిండు జీవితాలను బలితీసుకోకుండా, ఆలోచనతో సమస్యలను అధిగమించేందుకు ప్రయత్నించాలని స్థానిక సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.మణి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జాతీయ సేవా ప్రోగ్రాం ఆఫీసర్ జలుమూరు రవిబాబు ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్యామసుందర్ అధ్యక్షతన మండల న్యాయ సేవా సమితి ఆమదాలవలస వారు న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ముఖ్యంగా విద్యా హక్కు చట్టం, బాల కార్మికుల చట్టం, బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని భవిష్యత్తును చక్కదిద్దుకోవాలన్నారు. ఏజీపీ ఎస్.గోవిందరావు, న్యాయవాదులు తమ్మినేని అన్నంనాయుడు, సనపల ప్రసాదరావు, బొడిగ హరీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణానికి కృషి

ఆమదాలవలస: జనవిజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి కృషిచేయాలని ఆ వేదిక జిల్లా అధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దనరావు పిలుపునిచ్చారు. స్థానిక లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులను శనివారం కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. సభ్యులుగా చేరాలని కోరారు. మనం చేసే శాస్త్రీయ ఆలోచన క్రమాన్ని ఆటంక పరిచే శక్తులు సామాజిక వ్యవస్థలో ఉన్నాయన్నారు. అనేక రంగాల్లో శాస్త్ర విజ్ఞానం దూసుకుపోతోందన్నారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరిచేందుకు జన విజ్ఞాన వేదిక జాగృతి చేస్తోందన్నారు. జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు హెచ్.వి.సత్యనారాయణ, మెండ శ్యామలరావు, బెండి గోవిందరావు ,చింతాడ వెంకటరమణ, కె.షణ్ముఖరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.